

# "ఆమె కథ"

యస్వీ. శివాజీరావు

**నా మనసంతా గజిబిజిగా వుంది. ఆలోచనలు ఒకదాని వెనుక ఒకటి అర్థాంతరంగా సాగుతూ నా సమస్యను మరీ జటిలం చేసేస్తున్నాయి.**

పొద్దున మా ఆవిడ యిచ్చిన సలహా ఎంత సమంజసంగా వుంది! ఆడవాళ్ళు భవిష్యత్తు గురించి చాల కూలంకషంగా ఆలోచించగలరు. అందుకే మగవాడి జీవితరథానికి ఆడది సారథి వంటిది.

నిజమే. బాబు చాలా బాగా చదువుతాడు. ఒకరిద్దరు టీచర్లు కూడ వాడి గురించి తనతో గొప్పగా చెప్పారు. టెన్త్‌లో వాడికి స్కూల్లో మొదటి రాంకు వస్తుందని అందరి అంచనా. నాకు కూడ ఆ నమ్మకం వుంది.

తరువాత కాలేజీలో చేర్పించడానికి బోలెడంత ఖర్చవుతుంది. ఇంటి నుండి కాలేజీ చాల దూరం కాబట్టి సైకిలు కూడ తప్పనిసరిగా కొనివ్వాలి. మిగతా పిల్లల యూనిఫాంలకు, పుస్తకాలకు కూడ నడుం విరిగిపోతుంది.

ఒక్కసారిగా అంత డబ్బు కోసం యిబ్బంది పడే కంటే యిప్పటి నుంచే ప్రయత్నించడం మంచిదని శ్రీమతి చెప్పింది బాగానే వుంది. కానీ ఎలా? ఏ దారీ కనబడదం లేదు. స్నేహితులతో అప్పుల లావాదేవీలు పెట్టుకోకూడదన్న నా సిద్ధాంతాన్ని వదులుకోలేను.

ఎంత కష్టమయినా సరే బాబు భవిష్యత్తుకు నా

ఆర్థిక యిబ్బందులు ప్రతిబంధకం కాకూడదు. బహుశ వాడికి స్కాలర్‌షిప్ కూడ వస్తుందో ఏమో!

ఈ ఆలోచనలతో కాఫీ తాగుతూ, కాంటీనులోని వీక్లీని తిరగేస్తున్న నా చేతులు, కళ్ళు ఒక పేజీలో ఆగిపోయాయి.

"కథల పోటీ- మొదటి బహుమతి అయిదు వేలు- రెండవ బహుమతి మూడు వేలు- మూడవ బహుమతి వేయి రూపాయలు."

నాలుగు రోజుల నుంచీ నన్ను వేధిస్తున్న ప్రశ్నలకు పరిష్కారం చూపడానికి యిదొక మార్గం కాగలదా?

నాలుగయిదు కథలు రాశాను కానీ పోటీకి ఎపుడూ పంపలేదు. ఇపుడు ప్రయత్నిస్తే?

ప్రకటన పూర్తిగా చదివాను. కథలు పంపడానికి యింకా యిరవై రోజుల వ్యవధి వుంది.

సీటులో కూర్చుని పని చేస్తున్నా ఆలోచనలు నా మనసును కందిరీగల్లాగా తొలిచేస్తున్నాయి. ఏదైనా ఒక మంచి కథను రాసి పోటీకి పంపితే?

మూడవ బహుమతి వచ్చినా సరే పిల్లల స్కూలు ఖర్చులు గడచిపోతాయి- రెండో బహుమతి వస్తే అమ్మ అల్సరుకు ఆపరేషను కూడ చేయించవచ్చు- మొదటి బహుమతి గనక వస్తే, చెల్లెలి పెళ్ళి కోసం నగలన్నీ పెట్టి బాంకులో తీసుకున్న అప్పు కూడ కొంత వరకు తీర్చవచ్చు.

నా ఆశల ధోరణి నాకే నవ్వు తెప్పించింది. కానీ యింతకీ నేను అంతమంచి కథను రాయగలనా? మామూలుగా బహుమతి వచ్చే కథలు ట్రాజిక్‌గా వుంటాయి. నేను కూడ ఏదైనా ఒక గొప్ప ట్రాజిక్ ప్లాటు ఆలోచించాలి.

సాయంత్రం కాఫీ యిస్తూ "నేను చెప్పిన సంగతి ఏమయినా ఆలోచించారా?" అడిగింది మా ఆవిడ.

"ఆలోచిస్తున్నాను" అన్నాను. నేనేమాలోచిస్తున్నానో తెలిస్తే నవ్వుతుందేమో!

ఆ రాత్రంతా 'ప్లాటు' గురించిన ఆలోచనలతో నిద్ర పట్టలేదు నాకు. నాలుగయిదు అయిడియాలు వచ్చినా పోటీ 'స్టాండర్డు' లేదనిపించి వాటిని వద్దనుకున్నాను.

మరుసటి రోజంతా ఆఫీసులో కూడ సరిగా పని చెయ్యలేకపోయాను. సాయంత్రం యింటికెళ్ళి ముఖం కడుక్కుని పార్కుకు బయలు దేరాను ప్లాటు ఆలోచించుకోవడం కోసం. ఒక మూలగా ఎవరూలేని చోటు చూసుకుని కూచున్నాను.

ఒక గంట గడిచినా, అరడజను సిగరెట్లు వూది పారేసినా, ఆలోచనలతో తల వేడెక్కిపోయింది గాని 'అయిడియా' మాత్రం రాలేదు.

"వేరు శెనక్కాయలు కావాలా బాబుగారూ" పీలగా వినిపించిన ప్రశ్న నా ఏకాగ్రతకు భంగం కలిగించింది. తలతిప్పి చూశాను.

ఎవరో ముసల్ది. గంపలో శెనక్కాయలు అమ్ముకుంటోంది. ఆమెను నిరుత్సాహ పరచడం యిష్టంలేక జేబులోంచి పావలా తీసి యిచ్చాను. వణికే చేతులతో గంపలోంచి ఒక డబ్బాతో శెనక్కాయలు కొలుస్తోంది.

ఆమెను పరీక్షగా చూశాను. పండిపోయిన జుట్టు, ముడుతలు పడిన ముఖం, నిటారుగా నిలబడలేని శరీరం, వణుకుతున్న చేతులు. దైవ ధ్యానంతో కాలం గడపవలసిన యీ చరమ దశలో కూడ కష్టపడవలసి రావడం ఎంత దురదృష్టం!

ఈ వయసులో యీమెకు పూటకు పిడికెడు మెతుకులు పెట్టేవారు లేకపోయారా? లేక వుండీ చేరదీయలేదా?

ఈమె కంటే తక్కువ వయసు వాళ్ళు, ఆరోగ్యంగా వున్న వాళ్ళు ఎంతో మంది అడుక్కోవడం చూశాను నేను.

ఈమె మనసులో అడుక్కోవడానికి అడ్డు పడేంత ఆత్మాభిమానం వుందా? యింత వయసులో కూడ స్వతంత్రంగా బ్రతకాలన్న తపన వుందా? ఏ పరిస్థితులు యీమె జీవితాన్ని యీ స్థితికి చేర్చిందో?

నా మనసులో చటుక్కున ఒక ఆలోచన వుద్భవించింది..... అలా చేస్తే?

"యిలా కూర్చో అవ్వా" మృదువుగా అన్నాను ఆమెతో. నా వంక వింతగా ఒకసారి చూసి- తిరిగి తిరిగి కాళ్ళు కూడ లాగుతున్నాయేమో- నాకు ఎదురుగా, దూరంగా గంపను నడుము మీద నుండి కిందకు దించి, మెల్లగా కూచుంది.

"ఈ వయసులో నువ్విలా శెనక్కాయలు అమ్ముకుంటున్నావే- నీకెవరూ లేరా అవ్వా?" గొంతులో ఆప్యాయతను రంగరించి అడిగాను.

"ఇపుడెవరూ లేరు బాబుగారూ" నిస్తేజంగా అంది ఆమె.

శెనక్కాయలు వలిచి నోట్లో వేసుకుంటూ "అయితే ఎక్కడుంటావు?" అడిగాను.

శివాలయం పక్కన సత్రంలో బాబుగారూ!

"వీటి అమ్మకంతో నీకు గడచిపోతుందా అవ్వా?" ఆమె వద్ద నుండి నాకు కావలసిన విషయాలు ఎలా రాబట్టాలో అని ఆలోచిస్తూ అడిగాను.

"ఒక్క దానికి యీ వయసులో ఎంత గావాలి బాబూ - ఏదో అలా గడిచిపోతోంది లెండి."

"ఏది ఏమైనా యింత వయసు పైబడ్డాక కూడ ఎవరి అండా లేక, పూట గడవడం కోసం నువ్విలా కష్టపడడం చూస్తుంటే నాకు చాల బాధగా వుందవ్వా!"

ఎవరైనా వింటే నిజంగానే బాధ పడుతున్నాడు అనుకుంటారేమో.

"ఏం చేస్తాం బాబుగారూ! విధి, ఖర్మ అవి మన చేతుల్లో లేనివి వున్నాయి కదా. వాటి ప్రభావం అనుభవించక తప్పదు" ఆమె స్వరంలో ఎలాంటి ఫీలింగ్ లేదు.

"చదువుకున్న దానిలాగా కూడా వుంది" ఆశ్చర్యంగా అనుకున్నాను.

"ఎందుకో నీ జీవితం గురించి తెలుసుకోవాలని పిస్తోంది. వివరంగా చెబుతావా అవ్వా?" మార్దవంగా అడిగాను.

"మీ కెందుకు బాబూ నా సోదెంతా" నా ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అడిగింది.

నా మనసులోని నిజమైన ఆలోచన తెలిస్తే ఆమె ఎలా రియాక్టు అవుతుందో?

"యిపుడే యింటికెళ్ళి చేసేదేంలేదు. కాస్త కాలక్షేపం అవుతుంది. అదీగాక యింకో మనిషితో కాసేపు గడపడం నీకు కూడ సంతోషంగా వుండదా అవ్వా" నా గాలానికి ఎర వేస్తూ అనునయంగా అన్నాను.

దానికి ఫలితం వెంటనే ఆమె ముఖంలో కనిపించింది.

"నిజమే బాబుగారూ. నాతో ఒక మనిషి యిలా



## వినోద్ ఎప్పుడూ ఆలస్యమే!

షూటింగ్‌కు సక్రమంగా వచ్చే అలవాటు లేదట వినోద్‌ఖన్నాకు. కొన్నేళ్ళు రజనీష్ ఆశ్రమంలో సన్యాసిగా వుండిపోయి తిరిగి చిత్రరంగంలోకి అడుగుపెట్టిన వినోద్‌ఖన్నా ప్రతి షూటింగ్‌కు నాలుగైదు గంటలు ఆలస్యంగా హాజరువుతాడట. రంజిత్‌ను ఈ విషయమై అడిగినప్పుడు అసలు షూటింగ్‌కు సక్రమంగా రావాలన్న ఇంగిత జ్ఞానం వుండేడిస్తే కదా అని విరుచుకుపడ్డాడట. వినోద్ పుణ్యమా అని చాలాసార్లు షూటింగ్ రద్దు కూడా చేసుకున్నాడట రంజిత్. ఆలస్యం అమృతం విషం అంటారు కాని వినోద్ విషయంలో అది 'అమృత'మేనేమో! మరి ఈ జబ్బు ఎలా మానుకుంటాడోనని జుట్టు పీక్కుంటున్నారట రంజిత్ లాంటి వాళ్లు!

## ఆమె కథ

అప్యాయంగా మాట్లాడి కొన్ని సంవత్సరాలే గడిచాయి'' గద్గదంగా అంది ఆమె.

ఆమె కళ్ళలో నీరు తిరగడం స్పష్టంగా కనిపిస్తోంది నాకు. నా స్వార్థం కోసం ఆమెను అనవసరంగా బాధ పెడుతున్నానేమో అని ఒక క్షణం నా మనసు మూలిగింది.

''మీకు చెప్పుకోవడంవల్ల నా గుండెలో ని మానని గాయాలవల్ల రగులుతున్న అశాంతి కొంతయినా అణగుతుందేమో - నా గురించి మీకు చెబుతాను బాబూ'' అంటూ కళ్ళు మూసుకుంది ఆమె.

ఎంత చక్కగా మాట్లాడుతూంది! నా ఆశ్చర్యం యినుమడించింది.

రెండు నిముషాల తరువాత మెల్లగా కళ్ళు తెరిచి ఆమె తన కథను చెప్పడం మొదలుపెట్టింది.

* * * * *

''రాజమండ్రికి యిరవై మైళ్ళ దూరంలోని గోదావరీ తీరానవున్న ఒక చిన్న పల్లెలో పుట్టాను నేను. నా చిన్నతనం ఎంతో ఆనందంగా, ఆహ్లాదంగా గడచింది. ఎటుచూసినా గోదావరి నీరు తాగి పచ్చగా, ఏపుగా పెరిగిన పంట పొలాలు, విశాలమయిన తోటలు, ఎంతో గారాబంగా చూసుకునే తల్లితండ్రులు, ఆడుకోవడానికి, చుట్టుపక్కల ఎందరో పిల్లలు - మనిషికి తన చిన్నతనంనాటి తీపి గురుతులు నిజంగా ఒక పెన్నిధి లాంటిది.

''మా నాన్న ఆ ప్రాంతాలవారంతా గౌరవించే పెద్ద రైతు. ఆ రోజుల్లో ఆడపిల్లను బడికి పంపేవారు కాదు. మా నాన్న చదవడం, రాయడం బాగా వచ్చేంతవరకు యింట్లోనే నా చదువు చెప్పించాడు. తరువాత నేనే ఆసక్తితో ఎన్నో పుస్తకాలు, సాహిత్యంలో పేరు పొందిన నవలలు చదువుకునేదాన్ని.

''నాకు పదహారేళ్ళు వచ్చాక పెళ్ళి చేశారు. అప్పట్లో ఆడపిల్లకు అంత ఆలస్యంగా పెళ్ళి చేసినందుకు మా నాన్న ఎందరి విమర్శలకో గురి కావలసి వచ్చింది.

''ఆ రోజుల్లో మన దేశ ప్రజలు బ్రిటిషు వారి కర్కశ పాలనలో పడరానిపాట్లు పడుతుండేవారు. గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం తలపెట్టడంతో స్వాతంత్ర్య పోరాట ప్రభావం మా నాన్న మీద పూర్తిగా పడింది. నేనొక్కతినే సంతానం కావడంతో ఆస్తిపాస్తులు, యింటి బాధ్యతలు అన్నీ మా ఆయనకు అప్పచెప్పి, అసంఖ్యాకమయిన ప్రజలతో పాటు మా నాన్న కూడ గాంధీగారి వెంట వెళ్ళిపోయారు. ఆయన్ని మేము మళ్ళీ చూడలేదు. ఆ బెంగతో నే మా అమ్మ కొన్నాళ్ళకు కళ్ళు మూసింది.

''నా భర్త కూడ స్వాతంత్ర్యోద్యమం పట్ల ఎంతో వుత్సాహం చూపేవారు. యింటి బాధ్యతలన్నీ చూసుకుంటూనే, చుట్టుపక్కల జరిగే సభలకు, సమావేశాలకు హాజరవడమే గాక, ఆర్థికంగా కూడ వుద్యమ నాయకులకు ఎంతో చేయూత నిచ్చేవారు. కానీ శాంతియుత విధానాల ద్వారా మనకు స్వాతంత్ర్యం సిద్ధించదేమోనన్న అభిప్రాయం ఆయనలో క్రమక్రమంగా బలపడ సాగింది. నేతాజీ సిద్ధాంతాల స్ఫూర్తితో, అల్లూరి సీతారామ రాజును ఆదర్శంగా చేసుకుని, ఆయనకు అనుకూలంగా వుండిన యువకులందరినీ ఒక దండుగా తీర్చిదిద్దారు. వారంతా పరాయి పాలకులను నానా యిబ్బందులూ పెట్టేవారు.

''ఒకసారి ఏవో పన్నుల వసూలుకు వచ్చిన బ్రిటిషు అధికారుల దర్పాన్నీ, వారు చూపిన జులుంని సహించలేక తిరగబడితే, వారు తమ తుపాకులతో నా భర్తతో పాటు యింకో ఆరుగురిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు.

''అప్పటి నుండి నా జీవితంలో అశాంతి మొదలయింది. అపుడు నాకు ముప్పయి ఏళ్ళు. నలుగురు పిల్లలు. చిన్నపాపకు నాలుగు నెలల వయసు. వాళ్ళను పెంచడానికి ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. తండ్రి గుర్తుకు వచ్చినపుడల్లా ఏడ్చేవాళ్ళు. సముదాయించడం చాల కష్టమయ్యేది.

''నా ఒంటరితనాన్ని ఆసరాగా తీసుకుని నన్ను లోబరుచుకోవాలని • కొందరు ప్రయత్నించారు. కొంత మంది నా పొలాల్ని చవగ్గా కొట్టేయడానికి, అక్రమంగా ఆక్రమించుకోవ డానికి కూడ ప్రయత్నించారు. వీటన్నిటి నుండి నన్ను, నా పిల్లలను ఎంతో ఆత్మబలంతో కాపాడుకోవలసి వచ్చింది.

''ఎంతో మంది ఎన్నో కష్టాలనుభవించి, ఎన్నో రకాల త్యాగాలు చేసి, ఎంత కాలంగానో కలలు కంటున్న "స్వాతంత్ర్యం" మన దేశానికి లభించింది. అయితే అంతవరకు అందరి మధ్య వున్న ఐకమత్యం సన్నగిల్లడం ప్రారంభ మయింది. మనుషులలో నిజాయితీ తగ్గి, స్వార్థం చోటు చేసుకోవడం మొదలయింది.

''పొలాలన్నీ ఒక్కదాన్ని చూసుకోలేక కౌలుకిచ్చేశాను. ఆదాయం రాను రాను తగ్గిపోయింది. పిల్లలతో పాటు పెరుగుతున్న వాళ్ళ అవసరాలు, కాలేజీలో చదివించడానికి వాళ్ళను హాస్టల్లో వుంచవలసి రావడం– వీటి కారణంగా ఆస్తి క్రమంగా హరించుకు పోసాగింది.

''నా పిల్లల్లో కూడ నా భర్త మనస్తత్వమే పెంపొందింది. ఆయన వున్నపుడు, మన దేశాన్ని ఆంగ్లేయులు అక్రమంగా అంచెలంచెలుగా స్వాధీన పరచుకున్న వైనాన్ని వివరించి– స్వాభిమానం వున్న మనిషి బానిసత్వాన్ని ఏమాత్రం భరించరాదని, తను పుట్టిన భూమిని స్వతంత్ర ంగా నిలపడం కోసం ప్రాణాలనైనా లెక్క చెయ్యరాదని– వారి నరనరాల్లో వీరత్వాన్ని, దేశభక్తిని నింపేవారు.

''ఆ ప్రభావంతోనే పెద్దబ్బాయి కాలేజీ చదువుకాగానే ఆర్మీలో చేరిపోయాడు. కాప్టను కూడ అయాడు. చైనా మన దేశం మీదికి దురాక్రమణ జరిపినపుడు జరిగిన యుద్ధంలో వీరమరణం పొందాడు.

''రెండో వాడు అప్పటికే ఎయిర్‌ఫోర్స్‌లో వున్నాడు. పెద్దవాడి మరణంతో కృంగిపోయిన నేను, వెనక్కి వచ్చేయమని ప్రాధేయపడుతూ ఎన్ని వుత్తరాలు రాసినా వాడు లెక్క చెయ్యలేదు. పాకిస్తాన్ మన మీద దండెత్తినపుడు జరిగిన యుద్ధంలో వాణ్ని కూడ పోగొట్టుకున్నాను.

''తన చదువయిపోగానే మూడవవాడు కూడ నేవీలో చేరతానన్నాడు. అప్పటికే మనోవేదనతో కుంగిపోతున్న నేను ఎంతగానో బ్రతిమాలి వాడి నా ప్రయత్నం నుండి విరమింపజేశాను.

''బి. యిడి. చేసిన మా అమ్మాయికి టీచరుగా

### హేట్స్ ఆఫ్ టు డెమోక్రసీ!

గవర్నమెంట్ ఆఫ్ ది పీపుల్ బై ది పీపుల్
అండ్ ఫర్ దోజ్ హూ  కెన్ పర్చేజ్ ది పీపుల్!
ప్రజాస్వామ్యానికి ముఖ్యం ప్రజల ఓట్లు
అంతకంటె ముఖ్యమైనాయ్ కరెన్సీ నోట్లు!
ప్రతి రాజకీయవేత్త వేస్తాడు స్వలాభపుపాట్లు
దాంతో ఓటర్లకి మొదలౌ తున్నాయి అగచాట్లు!
ప్రతి పార్టీలోనూ సాధారణమైపోయాయి సిగపట్లు
వెలుస్తున్నాయి రోజూ కొత్తగా ఉదయిస్తున్న సూర్యుళ్ళ కటౌట్లు!
నిజంగా ఎంతో అదృష్టవంతులు ఇండిపెండెంట్లు
ఏ పార్టీలోనైనా యిట్టే కల్సిపోగల కేండిడేట్లు!
ఇతరుల కొరకే నీతులు పలికే మన నాయకుళ్ళు
ప్రజాస్వా(హా)మ్య గర్భగుడిలోని ప్రాణమున్న దేవుళ్ళు!
ఇంకా ఎన్నో (అవ)లక్షణాలున్న ది గ్రేట్ డెమోక్రసీ
చక్కగా వర్ధిల్లుతుంది మన దేశంలో .... యూ సీ!

– సిహెచ్. వి. బి. కె. రావ్

వుద్యోగం వస్తే ఒక వూరికి వెళ్ళింది. ఆమెకు పెళ్ళి సంబంధం కూడ ఖాయం చేశాము. కానీ అంతలో నే, తనపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆ వూరి ప్రెసిడెంటుగారి అబ్బాయిని పదిమందిలో చెంప దెబ్బ కొట్టిందన్న కక్షతో, ఒక రాత్రి అమ్మాయి వుంటున్న యింటిని మంటల కాహుతి చేసి దాన్ని సజీవ దహనం చేసేశారు. డబ్బుకు, రాజకీయ నాయకులకు దాసోహమనే అధికారులతో నిండి పోయి వున్న 'చట్టం' ఆ నరరూప రాక్షసుల నేమీ చేయలేక పోయింది.

"అమ్మాయి మరణంతో నా మనసును పూర్తిగా నైరాశ్యం అలుముకుంది. నాకు మిగిలిన ఒకే అబ్బాయి కూడ జీవితం పట్ల ఎటువంటి ఆసక్తి లేకుండా, మౌనంగా ఏదో ఆలోచిస్తూ పెళ్ళి చేసుకోమన్నా వినకుండా ఎపుడూ ఎక్కడెక్కడో తిరుగుతుండేవాడు. ఒక రోజు చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళకు ఒక వుత్తరం వచ్చింది. "స్వార్థంతో, ధన గర్వంతో, అధికార దర్పంతో ఎదుటి మనిషిని నిలువునా హింసించే వారి ఆధీనంలో వున్న యీ సమాజ వ్యవస్థపై అసహ్యంతో తనకు తిరుగుబాటు చెయ్యాలని పించిందని, దాని కవకాశం వున్న వ్యక్తులతో చేరిపోయానని" రాశాడు.

"ఆ తరువాత రెండేళ్ళకు ఒక వుత్తరం వచ్చింది. ఎవరు రాశారో తెలియదు. 'యీ సమాజంలోని అసమానతలను రూపుమాపటానికి తాము సాగిస్తున్న సమరంలో నా కుమారుడు అసువులు బాసాడని, అయితే నేలకొరిగే ముందు, తన చెల్లెలి మరణానికి కారకులైన వారి అంతం చూడాలన్న పంతాన్ని మాత్రం అతను సాధించుకో గలిగాడని వుంది అందులో.

"అప్పటినుండి దాదాపు జీవచ్ఛవంలా బ్రతుకు తున్నాను. అన్నీ గుర్తుకు వచ్చి గుండెలు పిండే దుఃఖాన్ని భరిస్తూ, మిగిలివున్న నా కొంత ఆస్తిని కూడ కాజేయాలనుకున్నవారు చేసే అగడాలు సహిస్తూ ఆ వూళ్ళో వుండలేక వచ్చేశాను. నాలుగయిదు వూళ్ళు తిరిగి యీ వూరు వచ్చి చేరాను. నా వారందరూ వారు కట్టుబడిన ఆశయాలకు తమ జీవితాల్ని బలి చేసినందుకు నేను గర్విస్తున్నా, నా తరువాత మా వంశం పేరు చెప్పేవారు, నాకు తల కొరివి పెట్టేవారు లేకపోయారన్న బాధ మాత్రం నాలో మిగిలి పోయింది.

"మరణం మాత్రమే నాకు పూర్తి ప్రశాంతత నిస్తుందని తెలిసినా ఆత్మహత్యకు పాల్పడే పిరికి దాన్ని కాకపోవడంచేత - దాని కోసం ఎదురు చూస్తూ వున్నాను. ఇదే బాబుగారూ నా కథ"

* * * * * *

నా మెదడు, మనసు, తనువు పూర్తిగా చైతన్యం కోల్పోయింది.

ఒక మనిషికి జీవితంలో యిన్ని విషాదాలా? తన కుటుంబంలోని వారందరూ యీ దేశం కోసం, యీ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాల్నే ఫణంగా పెడితే, యీనాడు యీమె అనాథగా తన చివరి రోజులలో కూడ కూటి కోసం పాటుపడుతూ బతకవలసి వచ్చిందా?

తన వాళ్ళందరినీ తమ కోసం త్యాగం చేసి నందుకు కృతజ్ఞతతో ఒక దేవతలాగా పూజించ వలసిన యీమెను, నిలువ నీడ లేకుండా వీధులపాలు చేశారా?

నా కళ్ళలోంచి వుబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ ఆమె వంక చూశాను.

చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ, పొంగు తున్న నా కన్నీటిని చూసి "క్షమించండి బాబుగారూ. అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను" దిగులుగా అంది.

"లేదమ్మా. మీ జీవితం ఎలాంటి వారినయినా కదిలించి వేస్తుంది" గొంతు పెగుల్చుకొని అన్నాను.

మనం 'పనికిరాని వాళ్ళ'మనే మన చుట్టూ వున్న మనుషులలో యిలాంటి ఉదాత్త చరితులెంద రున్నారో!

ఈమెకు అన్యాయం చేసిన వాళ్ళ నుండి రక్షించేందుకు ప్రభుత్వం తరఫున ఏ విధమైన సహాయమూ లభించే అవకాశం లేదా? యీమె అందుకు ప్రయత్నించలేదా?

ఆ మాటే అడిగాను.

"భూమి తగాదా విషయంలో సహాయం చేస్తారేమోనని ఒకసారి తాసీల్దారుని కలిసాను. నా అనుభవంలో గ్రహించింది- మనిషికి మనిషిగా ఎటువంటి విలువ, గుర్తింపు లేవని- మనిషి తన అవసరాల కోసం సృష్టించుకున్న డబ్బుకు తానే బానిసయిపోయి, ఆ డబ్బు సంపాదించుకోవడానికి వీలున్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తాడని- మనుషులలో పెరిగిపోయిన అవినీతి పట్ల అసహ్యంతో నేను అలాంటి ప్రయత్నాలు మానుకున్నాను బాబుగారూ" విరక్తిగా అంది ఆమె.

ఇలాంటి సమాజం కోసమా యీమె తన కుటుంబాన్నంతా బలిపెట్టింది?

"చాల గ్రాత్రయిపోయింది బాబుగారూ. యింటి కెళదాం లేవండి" తాను లేస్తూ అందామె.

టైము చూసుకున్నాను. ఎనిమిదయింది.

"మీరు రోజూ యీ పార్కుకు వస్తారా?" ఆమెను మళ్ళీ కలుసునే అవకాశం కోసం అడిగాను.

"అవును బాబుగారూ. ప్రతి సాయంత్రం తప్పకుండా ఒక గంటసేపు యిక్కడ గడుపుతాను".

ఆ రాత్రంతా ఆమెను గురించిన ఆలోచనలతో నిద్ర పట్టలేదు నాకు. ఆమె కోసం నేనేం చేయగలను? ఆమెను మా యింట్లోనే వుంచుకుని పోషిస్తే? యింట్లో వాళ్ళు ఒప్పుకుంటారా? అసలు ఆమె ఒప్పుకుంటుందా?


అడిగి చూడాలి.

ఇంతకీ తన కథ సంగతేమిటి?

ఆమె కథను బేస్ చేసుకుని ఒక మంచి కథ రాయొచ్చు. చాలా 'యింప్రసివ్'గా కూడా వుంటుంది. బహుమతి కూడ రావచ్చు. కానీ నా మనసందుకు ఒప్పుకోవడం లేదు. ఆమె మనుషుల స్వార్థానికి అన్నీ పోగొట్టుకొని యీ స్థితికి చేరుకుంది. నేను నా స్వార్థానికి ఆమె కథను వుపయోగించుకుని మానసికంగా ఆమెకు ద్రోహం చెయ్యలేను.

వేరే 'ప్లాటు' కోసం ప్రయత్నించాలి. పొద్దు పొడుస్తున్న వేళ, అపుడే నిద్రపడుతున్నపుడు, నా బుఱ్ఱలో ప్రవేశించింది ఆ ఆలోచన!

తరువాత నిశ్చింతగా నిద్రపోయాను. వారం రోజులు ఏకధాటిగా కూర్చుని ఆమె కథ ఆధారంగా



# ఆమె కథ

ఒక హృద్యమయిన కథను అల్లాను. కథ చాలా బాగా వచ్చింది. ఫెయిర్ చేసి పోటీకి పంపేశాను.

అప్పటి నుండి ప్రతి రోజూ పార్క్ కు వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. ఆమెతో ఎన్నో విషయాలు చర్చించేవాడిని. అప్పటి సాంఘిక పరిస్థితులను, స్వాతంత్ర్యోద్యమంలో జరిగిన ఎన్నో ఆసక్తిదాయకమైన సంఘటనలను ఆమె నా కళ్ళకు కట్టినట్టు వివరించేది. చరిత్రలోను, సాహిత్యంలోను ఆమెకున్న పరిజ్ఞానం ఒక్కోసారి నాకెంతో ఆశ్చర్యం కలిగించేది.

మా యింటికి వచ్చి మాతో పాటు వుండిపోవడానికి ఆమె సుతరామూ ఒప్పుకోలేదు. యింట్లో ఏవయినా స్పెషల్స్ చేసినపుడు మాత్రం తప్పకుండా తీసికెళ్ళేవాడిని. అవి తీసుకోవడానికి కూడ ఆమె ఎంతో మొహమాటపడేది. నాతోపాటు మా పిల్లలు కూడ ఆమె కోసం అపుడపుడూ వచ్చేవాళ్ళు. వాళ్ళకి ఆమె లెక్కలేనన్ని కథలు ఎంతో వుత్సాహంగా చెప్పేది. రాను రాను ఆమెతో ఒక విడదీయలేని అనుబంధం ఏర్పడిపోయింది మాకు.

ఒక రోజు ఆఫీసులో వుండగా టెలిగ్రాం వచ్చింది నా కథకు మొదటి బహుమతి వచ్చిందని, బయోడేటా పంపమని సారాంశం.

ఉద్వేగంతో తబ్బిబ్బయి పోయాను నేను. అయిదువేల రూపాయలను పోస్టాఫీసులో ఆమె పేర డిపాజిట్ చేసేయాలి. ఇక మీదట ఆమెకు ఎటువంటి శ్రమ కలగకూడదు. నెల ఖర్చులకు అవసరమయినంత విత్‌డ్రా చేసుకుని, మంచి పుస్తకాలు చదువుకుంటూ ఆ డబ్బుతో ఆమె తన చివరి రోజుల్నయినా హాయిగా ప్రశాంతంగా గడపాలి.

బహుమతి వస్తే ఏం చేయాలని నేను యిది ముందుగా ఆలోచించి నిర్ణయించుకున్నదే!

నా మనసంతా సంతోషంగా తేలికగా వుంది. వెంటనే వెళ్ళి ఆమెతో చెప్పాలని ఆతృతగా వుంది. కానీ ఆడిట్ జరుగుతున్నందు వల్ల కదలలేను. సాయంత్రం పార్క్ లో చెప్పాలి.

ఆమె సంతోషిస్తుందా? తన జీవితాన్ని ఒక కథగా వాడుకున్నందుకు కోప్పడుతుందా? నా నిర్ణయాన్ని అంగీకరింప చేయడానికి ఆమెనెలాగైనా కన్విన్సు చెయ్యగలనన్న నమ్మకం నాకుంది.

మా మధ్య వున్న స్నేహం అంత గొప్పది మరి!

సాయంత్రం యింటికి కూడ వెళ్ళకుండా నేరుగా పార్క్ కి వెళ్ళి కూచున్నాను. ఆత్రంగా అరగంట ఎదురు చూసినా ఆమె జాడ కనిపించలేదు. యిలా ఎపుడూ జరగలేదు.

ఆరోగ్యం గాని బాగాలేదా?

ఇక వుండలేక ఆమె చెప్పిన గుర్తుల ప్రకారం శివాలయం ప్రక్కన వున్న సత్రాన్ని చేరుకున్నాను.

బయట ఎవరో అయిదారుమంది నిలబడి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళనడిగాను.

"ఇక్కడ వేరుశనక్కాయలమ్మే ఒక ముసలామె వుండాలి. తెలుసా?"

వాళ్ళు మౌనంగా చేతితో ఒక దిక్కు చూపించారు. అటు చూసిన నాకు, చిరిగిన చాప మీద పడుకోబెట్టబడిన అచేతనమయిన ఆమె శరీరం కనిపించింది.

కొంతసేపు వూపిరి ఆడలేదు నాకు. కళ్ళల్లోంచి కన్నీరు వుబుకుతోంది. గొంతులోంచి ఏడుపు తన్నుకొస్తోంది.

ఏడుస్తున్న నన్ను చూసి "ఆమె మీకు తెలుసా? బంధువులా?" అడిగాడు ఒకతను.

ఆమె నాకేమవుతుంది?

"అమ్మ.... ఆమె మా అమ్మ...." పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆమె పాదాలపై వాలిపోయాను.

"కొడుకట కొరివి పెట్టడానికి మంచి సమయానికి వచ్చాడు. లేకపోతే మునిసిపాలిటీ వాళ్ళ చేత లాగించేసేవాళ్ళం".

వెనుక వాళ్ళు మాట్లాడుకుంటున్నది నా దుఃఖాన్ని మరింత వుధృతం చేసింది.

●


నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి
చర్మవ్యాధులు నుండి విముక్తులు కండి!



హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసం, సోరియాసిస్ పొడలు, దురద, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖసంబంధమైనవ్యాధులు, ఫ్స్టులా, మూలశంకలు, స్త్రీలకుసుమ వ్యాధులు, బ్లడ్‌ప్రెషర్, పక్షవాతము, మెహపొడలు, సమస్త దీర్ఘ వ్యాధులకు, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స, పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు.

ప్రతినెల క్యాంపులు :-

ప్రతినెల క్యాంపులు:

రాజమండ్రి: 1,16 తేదీలలో "అశోకాలాడ్జి", కోటగుమ్మంవద్ద,
కాకినాడ : 2,17 తేదీలలో "వీనస్ A.C. లాడ్జి", కల్పనాటాకీస్ ఎదుట
భీమవరం: 3,18 తేదీలలో "షణ్ముఖ లాడ్జి"
ఒంగోలు: 9 వ తేదీ "హోటల్ పూర్ణిమ" A.C., బస్టాండ్ దగ్గర.
ఖమ్మం : 25 వ తేదీ "హోటల్ కిన్నెర" A.C., బస్‌స్టాండ్ దగ్గర.

Note: ప్రతికేంద్రంలో ఉ॥ 10-00 గం॥ నుండి రాత్రి 10-00 గం॥ వరకు. పైతేదీలు మినహా మిగిలిన దినములలో డాక్టరుగారు గుడివాడలోని క్లినిక్‌లో వుంటారు.

SHAH

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ-521301 * ఫోన్స్: 2522 & 2540.



ఇంటిల్లిపాదికీ ఆనందాన్నిచ్చే
సచిత్ర పక్షపత్రిక ఏది?
ఇంకేది?
ఇంటింటి పత్రిక
"ఇంతుల" పత్రిక
కలువ బాల
ఆంధ్రపత్రికవారి అందాల పక్షపత్రిక
తెలుగు మహిళ అందచందాలకి సాహితీసౌరభాలకి ప్రతిబింబం!
తెలుగింటి యిల్లాలికి నిత్యావసర వస్తువు